క్లుప్తంగా

పరీక్ష సామగ్రి వితరణ

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన భవన నిర్మాణ కాంట్రాక్టర్ మీసాల చంద్రరావు పరీక్ష సామగ్రిని సోమవారం వితరణ చేశారు. 100 మంది విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అవసరమైన అట్టలు, పెన్నులు, స్కేళ్లు వంటివి అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.తేజావెంకటేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ తవిటినాయుడు, ఎంపీటీసీ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహావిష్కరణ

రేగిడి: మండలంలోని అంబాడ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. రాజాం రెడ్ క్రాస్ ప్రతినిధి కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తన తల్లిదండ్రుల కోరిక మేరకు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు, సర్పంచ్ వెంకటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన

రాజాం: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను తహసీల్దార్ ఎస్.కె.రాజు సోమవారం పరిశీలించారు. మొత్తం ఎనిమిది గదులను ఈవీఎంలను భద్రపరిచేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓటింగ్‌కు ముందు ఈవీఎంలు ఇక్కడ ఉంటాయని, పోలింగ్ పూర్తయిన తర్వాత ఈ ఈవీఎంలు జిల్లా కేంద్రానికి తరలిపోతాయని, అక్కడే లెక్కింపు కూడా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీటీ వెంకటేష్, ఎన్నికల డీటీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

100 మద్యంసీసాలు, బైక్ స్వాధీనం

బాడంగి: అక్రమంగా మద్యం తరలిస్తున్న సమాచారం మేరకు పోలీసులు కాపుకాసి బైక్‌పై 100మద్యంసీసాలను తరలిస్తున్న వ్యక్తిని సోమవారం పట్టుకున్నారు. తెర్లాం మండలం నందబలగకు చెందిన ఆనెం గోపి బాడంగి మద్యంషాపు నుంచి తనస్వగ్రామం నందబలగకు బాటిల్స్ తరలిస్తుండగా మండలంలోని పాల్తేరువద్ద పట్టుకున్నట్టు ఎస్సై ఆర్. జయంతి తెలిపారు. ఈ మేరకు కేసున మోదుచేసి జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం నిందితుడిని బొబ్బిలి తరలించి, ద్విచక్రవాహనాన్ని సీజ్‌చేసి స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఎస్సై చెప్పారు. ఏఎస్సై కొండలరావు, సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

తెర్లాం: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం(స్పందన)కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో బి.మధుసూదనరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించగా, పలు సమస్యల పరిష్కారానికి ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను ఆయన స్వీకరించి, పరిశీలించారు. అనంతరం వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏదైనా కారణంతో సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత అర్జీదారుకు ఆ సమస్య ఎందుకు పరిష్కారం కాలేదో తెలియజేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీల్డ్ టెండర్ల ద్వారా వేలం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ ఆశీల వసూళ్లకు సంబంధించి, సీల్డ్ టెండర్ల ద్వారా మంగళవారం వేలంపాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సోమవారం వెల్లడించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ప్రాంతంలో టెండర్లు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు. ఇదిలా ఉండగా, సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బహిరంగ వేలం వాయిదా పడింది. కాంట్రాక్టర్‌లు ఎవరూ వేలంపాట పాడేందుకు ముందుకు రాకపోవడంతో గతంలో 7 సార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించండి

బాడంగి: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ డాక్టర్ అర్చన, స్టాఫ్‌నర్స్ సాయికుమారి అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ప్రధానమంత్రి శిశుమాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంవై)పై గర్భిణులకు సోమవారం అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకుని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని వారు తెలిపారు.

బకాయి రుణాలు వసూలు చేయండి

వంగర: మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులు చెల్లించాల్సిన బకాయి రుణాలను ఈ నెలాఖరు నాటికి వసూలు చేయాలని రాజాం వెలుగు కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలతో సమావేశమైన ఆయన మండలంలోని 30 గ్రామైక్య సంఘాల పరిధిలో మంజూరు చేసిన స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, హెచ్‌డీఐఎఫ్, ఎస్‌వీఐఎఫ్, ఎంకేఎస్‌పీ వంటి రుణాలను రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు మీసాల చక్రపాణి, తెర్లి మంగమ్మ, స్త్రీనిధి మేనేజర్ వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామస్వరాజ్యం

- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


అలజంగిలో రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధ్యమైందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కలువరాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలతో పాటు, అలజంగి గ్రామంలో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా బాపూజీ భావించిన గ్రామస్వరాజ్య సాధన సాకారమైందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు వచ్చి, చేరుతున్నాయన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. సీఎం జగనన్న ఈ నాలుగున్నరేళ్ల కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేసి, ప్రతీ ఇంట్లో సంక్షేమ వెలుగులు ఉండేలా చేశారన్నారు. ఇదిలా ఉండగా, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందడంతో పాటు పంటకు గిట్టుబాటు ధర కల్పించి, సులువుగా పంట విక్రయం కూడా జరుగుతోందన్నారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ల ద్వారా గ్రామస్తులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చూస్తున్నారన్నారు. ఇదే సుపరిపాలన కావాలంటే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే ఆశీర్వదించి, మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందరరావు, పీఆర్ డీఈఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సీఎం జగన్

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: అభాగ్యులకు అండగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రశంసించారు. మండల కేంద్రానికి చెందిన ముంజేటి ప్రశాంత్‌కుమార్, అంజలి దంపతులకు మంజూరైన రూ.2.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును డిప్యూటీ సీఎం చేతులమీదుగా మండల కేంద్రంలో సోమవారం అందజేశారు. ఆ దంపతుల కవలపిల్లలు కొన్నాళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా, వారి వైద్యానికి అధిక మొత్తంలో ఖర్చు అవుతోంది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికసాయం కోసం స్థానిక వైఎస్సార్ సీపీ నేతల ద్వారా సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. డిప్యూటీ సీఎం చొరవతో నిధులు మంజూరు కాగా, వాటిని ఆ దంపతులకు అందజేశారు. ఆపదలో ఉన్న ఎంతోమంది పేదలను సీఎం జగనన్న ఆదుకుని, తన మంచి మనసును చాటుకున్నారన్నారు. అలాంటి వ్యక్తికి మనమంతా అండగా నిలవాలని కోరారు. తమ కష్టం తెలుసుకుని, ఆదుకున్న జగనన్నకు కృతజ్ఞతలని ఆ దంపతులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, మెంటాడ నాయకులు నారాయణరావు, విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో.. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు

- బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు


బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసుల కవాతు

తెర్లాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లోచర్ల, పెరుమాళి గ్రామాల్లో బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు, తెర్లాం ఎస్ఐ ఆర్.రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ఫ్లాగ్‌మార్చ్(కవాతు ప్రదర్శన) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బొబ్బిలి డీఎస్పీ ఆయా గ్రామాల ప్రజలను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. ఎస్పీ ఎం.దీపికా పాటిల్ ఆదేశాల మేరకు బొబ్బిలి నియోజకవర్గంలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే తెర్లాం మండలంలోని లోచర్ల, పెరుమాళి గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించామన్నారు. గ్రామీణుల్లోని ఎన్నికల భయాన్ని తొలగించి, వారంతా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వారి ఓటు వారు వేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల గురించి ముందస్తు సమాచారమివ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే పలు గ్రామాల్లో బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెర్లాం ఎస్ఐ రమేష్, ఆర్‌పీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఐటీఐ, ఇందిరమ్మ కాలనీల్లో పోలీసులు సోమవారం ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సీఐ ఎం.నాగేశ్వరరావు కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలింగ్ జరిగేలా సహకరించాలని ప్రజలను కోరారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే చర్యలు ఎవరు చేపట్టినా సమాచారమివ్వాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మతో కలిసి ఆయన క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని జెండా ఊపి, ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి, జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేసి, తాగునీరు సరఫరా చేస్తోందన్నారు. ఇప్పుడు క్రాస్‌ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లను బాగుచేస్తోందన్నారు. వైస్ ఎంపీపీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పాడైన బోర్లను బాగుచేయిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం, బూరాడ, అక్కన్నఅగ్రహారం, కొమెర, వన్నలి గ్రామాల్లో తాగునీటి బోర్ల మరమ్మతులు పరిశీలించిన ఆయన ఏ ప్రాంతంలోనూ తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులదేనన్నారు.

క్రాస్‌ప్రోగ్రాం ప్రారంభం


క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు ఏటా వేసవిలో ప్రభుత్వం చేపడుతున్న క్రాస్‌ప్రోగ్రాంను స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు కలిసి సోమవారం ప్రారంభించారు. ఓ ప్రత్యేక వాహనం ద్వారా మెకానిక్‌లు గ్రామగ్రామానికి వెళ్లి, ఎక్కడైనా పాడైన బోర్లు ఉంటే బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తారని వారు తెలిపారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి

వంగర: బాల్యవివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో సింగిరెడ్డి సాల్మన్‌రాజ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలన కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన బాల్యవివాహాల కారణంగా కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం ద్వారా అవగాహన లేమితో దంపతుల సంబంధాలు దెబ్బతింటాయని, అలాగే ప్రసవం సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించేలా ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీ బూరాడ సుందరరావు, ఎంఈవో వై.దుర్గారావు, ఏపీఎంలు తెర్లి మంగమ్మ, మీసాల చక్రపాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజినీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.పైడితల్లి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. తహసీల్దార్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

16తో చెరకు క్రషింగ్ పూర్తి

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారిస్ చక్కెర కర్మాగారంలో ఈ నెల 16తో చెరకు క్రషింగ్ పూర్తికానుందని సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి తెలిపారు. చక్కెర కర్మాగారంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 4లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయాల్సి ఉండగా, ఇంతవరకు 3.72 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయిందన్నారు. సంకిలి కర్మాగారం పరిధిలో 2.90 లక్షల టన్నులు, బొబ్బిలి కర్మాగారం పరిధిలో 90,709 టన్నులు, భీమసింగి పరిధిలో 60,632 టన్నుల చెరకు క్రషింగ్ చేసినట్టు వెల్లడించారు. మిగిలిన రైతులు కర్మాగారానికి వెంటనే చెరకును తరలించాలన్నారు. డివిజన్ స్థాయిలో మిగిలి ఉన్న చెరకుకు సంబంధించి సీడీఓలు నేరుగా కటింగ్ ఆర్డర్లు రైతులకు ఇస్తారని వివరించారు. చక్కెర కర్మాగారానికి చెరకును తరలించి క్రషింగ్‌కు సహకరించిన రైతులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది చెరకు రికవరీ 9.24 శాతంగా వచ్చిందన్నారు. ఈ ఏడాది చెరకు క్రషింగ్ అక్టోబర్ 31న ప్రారంభించామని తెలిపారు. వచ్చే 2024-25 సీజన్లో 18వేల ఎకరాల్లో చెరకుసాగు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 10వేల ఎకరాల్లో చెరకు సాగు ఆరంభమైందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (కేన్) రాజేంద్రన్, హెచ్‌ఆర్ హెడ్ మేనేజర్ మురళీకృష్ణ, ఫైనాన్షియల్ మేనేజర్ శ్యామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాల్‌సెంటర్ల ఏర్పాటుకు ఆదేశం

బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, సమాచార కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ కాల్‌సెంటర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు ఆదేశించారు. బొబ్బిలి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో రిసెప్షన్ సెంటర్‌ను, మండల పరిధిలోని మెట్టవలస పోలింగ్ కేంద్రాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్ల సిబ్బందికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలన్నారు. వీడియో గ్రాఫర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. మెట్టవలస పోలింగ్ కేంద్రం వద్దగల మరుగుదొడ్లను బాగుచేయించాలన్నారు. ఆమె వెంట ఆర్డీఓ ఎ.సాయిశ్రీ, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, డీటీ సాయికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

17 నుంచి పోలిపల్లి పైడితల్లి జాతర

రాజాం: పట్టణంలో ఈ నెల 17వ తేదీ నుంచి పోలిపల్లి పైడితల్లి జాతర నిర్వహిస్తున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. ఇదే విషయమై ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులతో కలిసి దేవదాయ శాఖ ఈవో బలివాడ వైకుంఠమాధవరావు విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించి, మాట్లాడారు. ఆలయ 98వ వార్షికోత్సవంలో భాగంగా ఈ ఏడాది పెద్దఎత్తున జాతర నిర్వహిస్తున్నామని మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నామన్నారు. అనంతర జాతర కార్యక్రమాలు కలిగిన కరపత్రాలు ఆవిష్కరించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రాజాం: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, అలా అయితేనే వారి ప్రాంతాల్లో సామాజికాభివృద్ధి కనిపిస్తుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద లఖపతి దీదీలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ రుణాలు వంటి పథకాల ద్వారా బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి రుణాలు, డ్వాక్రా రుణాలు తీసుకున్న మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యారన్నారు. ఏడాదికి కిరాణా షాపులు, డెయిరీ ఫామ్‌లు పెట్టి రూ.1 లక్ష వరకు ఆదాయం తెచ్చుకుంటున్నారన్నారు. ఇలా అదనపు ఆదాయం తెచ్చుకున్న వారికి ఈ సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నర్సింహులు, వైస్ ఎంపీపీ వెంకటేష్ , తదితరులు పాల్గొన్నారు.

వంగర: ప్రతీ మహిళా లక్షాధికారి కావాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ ఆకాంక్షించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానమంత్రి లక్‌పతి దీదీ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో హిళలతో కలిసి పాల్గొన్న ఆయన వెలుగు శాఖ ఆధ్వర్యంలో లక్షాధికారులుగా గుర్తింపు పొందిన ఐదుగురు మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభివృద్ధికి అనేకానేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సింగిరెడ్డి సాల్మన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక 'చేయూత'

- మహిళా సాధికారతే లక్ష్యంగా జగనన్న పాలన
- అన్నింటా 'ఆమె'కే ప్రాధాన్యం
- 'వైఎస్సార్ చేయూత' కింద మెంటాడ వాసులకు రూ.29కోట్ల లబ్ధి
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: మహిళా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ప్రభుత్వ పథకాల్లో 'ఆమె'కే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పోరాం గ్రామంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వైఎస్సార్ చేయూత సంబరాల్లో ఆయన మాట్లాడారు. మెంటాడ మండలంలోని చేయూత లబ్ధిదారుల ఖాతాలకు నాలుగో విడతలో రూ.7.96కోట్లు, నాలుగు విడతల్లో కలిపి రూ.29కోట్లు జమచేసినట్టు వెల్లడించారు. చేయూత పథకం నిధులు అక్కచెల్లెమ్మల వ్యాపారానికి తోడ్పడుతున్నాయన్నారు. మహిళల్లో ఆర్థిక వికాసం స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. 2014లో బాబు వస్తాడు.. జాబ్ ఇస్తాడు అని ప్రచారంచేసిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను నిలువునా ముంచేశారన్నారు. 2019లో జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేశారని చెప్పారు. పేద పిల్లల విద్యాభివృద్ధి కోసం నాడు-నేడు పథకం కింద పాఠశాలను బాగుచేయడంతో పాటు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెను, విద్యాకానుకలు, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నట్టు వివరించారు. దేశం మొత్తం మీద అత్యధిక పింఛన్ ఇస్తున్న రాష్ట్రం మనదేనని స్పష్టంచేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు లెంక సన్యాసినాయుడు, పార్టీ అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, జేసీఎస్ కన్వీనర్ కనిమెరక త్రినాథ్, నాయకులు మయూర అప్పలనాయుడు, బాయ అప్పారావు, హనుమంతురాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నిధులను సక్రమంగా వినియోగించుకోవాలి


పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకరరావు

రాజాం: మండలంలోని అన్ని గ్రామాలకు ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థికసంఘం నిధులను సక్రమంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీవో బాసూరి శంకరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన 15వ ఆర్థికసంఘం నిధులు, ఖర్చులపై సమీక్షించారు. అంతకుముందు స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో గ్రామాల వారీగా వచ్చిన ఫిర్యాదులపై ఆరాతీశారు. స్పందన కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై వివరాలు సేకరించి, పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 22 మంది ఎంపిక

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) పరిధిలో సోమవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరంలో 22 మంది కంటి రోగులను శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్ఞ, ఆప్తాలమిక్ అధికారి వసంతరావు తెలిపారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గ్లకోమా వ్యాధిపై అవగాహన కోసం నిర్వహించిన ఈ శిబిరానికి పలు గ్రామాల నుంచి కంటి రోగులు హాజరయ్యారని, వీరిలో 55 మందికి నేత్ర వైద్య తనిఖీలు చేయగా, 22 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించామన్నారు. వీరందరినీ శస్త్రచికిత్స నిమిత్తం విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించినట్లు సదరు వైద్యాధికారులు తెలిపారు. అంతకుముందు ర్యాలీ చేపట్టి, గ్లకోమా వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెరుమాళి పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యాధికారి శ్రీనివాసరావు, సామాజిక ఆరోగ్య అధికారి పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ


పద్మావతి ఆరోగ్యంపై ఆరాతీస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లి గౌరునాయుడు భార్య పద్మావతిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. అనారోగ్యం కారణంగా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం పద్మావతి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆ గ్రామం వెళ్లి, ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు.

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పరంగా సాయమందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు వియ్యపు చక్రపాణి, కరణం శ్రీనివాసరావు, కెంబూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పిల్లా గౌరునాయుడు, పొట్నూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ


ఫ్లైఓవర్ వద్ద అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణ సుందరీకరణ పనులతో పాటు పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం భూమిపూజ చేశారు. ఇందిరమ్మ కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పట్టణంలో అవసరమైన చోట సీసీ రోడ్ల నిర్మాణం, ఫ్లైఓవర్ బ్రిడ్జి పెయింటింగ్ పనులు, ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాటు వంటివి చేపట్టనున్నారు. ఆయా పనులతో బొబ్బిలి పట్టణం సరికొత్త రూపును సంతరించుకోనుందని పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్‌లు చెలికాని మురళీకృష్ణారావు, రమాదేవి, మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగం జి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తెర్లాం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెర్లాం, పెరుమాళి, లోచర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, చిట్టెమ్మ, వెంకటలక్ష్మి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీవోఏలంతా సోమవారం ర్యాలీ నిర్వహించి, పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో 15 రోజుల పాటు చేపట్టే పౌష్టికాహార పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

రామభద్రపురం: తల్లి గర్భం దాల్చిన నాటి నుంచే శిశువు ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని ఎంపీడీవో ఈశ్వరమ్మ, తహసీల్దార్ సులోచరాణి అన్నారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పౌష్టిహార పక్షోత్సవాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని, కాసేపు మాట్లాడారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఈ పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల ఎత్తు, బరువులు పరిశీలించి, వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంతో రక్తహీనతను అధిగమించి, హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందని, అలాగే జింక్, విటమిన్-ఎ, విటమిన్-బి12, ఫోలిక్ యాసిడ్ వంటి సూక్ష్మపోషకాలు సమృద్ధిగా అందుతాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు సూర్యకుమారి, రత్నకుమారి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంగాం.. భక్తజన సంద్రం!


వంగర: ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని, సంగమేశ్వరస్వామి కొలువైన పవిత్ర పుణ్య క్షేత్రం సంగాం.. భక్తజనసంద్రాన్ని తలపిస్తోంది. ఈ నెల 8వ తేదీ నుంచి ఇక్కడ ఆరంభమైన ఉత్సవాలు ఇంకా కొనసాగుతుండగా, ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వంగర మండలంలోని సంగాం చేరుకుని, సంగమేశ్వరుని దర్శించుకుంటున్నారు. అక్కడి త్రివేణి సంగమం(వేగావతి, నాగావళి, సువర్ణముఖి నదులు కలిసే చోటు)లో పవిత్ర స్నానాలు ఆచరించి, పితృదేవతకు పిండప్రదానం చేస్తున్నారు. వేకువజాము నుంచే దైవదర్శనానికి భక్తులు క్యూలైన్‌లో పోటీపడుతుండడం విశేషం.

– వంగర